క్లుప్తంగా

ఎమ్మెల్యే కసిరెడ్డికి స్వాగతం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నాయకులు ఆదివారం నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాబా, సింగిల్ విండో డైరెక్టర్ జగన్, రమేష్ గౌడ్, విజయ్ రాథోడ్, శివ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు..



ఎమ్మెల్యే మల్‌రెడ్డితో పెంటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: ఇటీవల నూతనంగా డీసీసీ ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమితులైన పెంటయ్య.. ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి

తలకొండపల్లి: మండలానికి కావాల్సిన అన్ని వనరులు గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని, అయినా ఎందుకు గుర్తించడం లేదని జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని చేపట్టిన దీక్ష ఆదివారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మండలం ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నా.. ప్రభుత్వాలు స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అయినా మండలం ఏర్పాటు చేయాలని కోరారు. జేఏసీ వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, రామాంజనేయులు, రాములు, నరసింహ, జంగయ్య, బాల్యా నాయక్, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గ్రామస్తుల ధర్నా

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై తక్కళ్లపల్లి గేట్ వద్ద ఆదివారం కొత్తపల్లి గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ రోడ్డుపై తమ్మలోనిగూడ గేట్ వద్ద శనివారం కారు ఢీకొన్న ఘటనలో కొత్తపల్లికి చెందిన చరణ్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థి మృతికి కారణమైన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ధర్నా చేశారు. సదరు వ్యక్తిపై తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. నిరసన విరమించాలని గ్రామస్తులను కోరినా.. ససేమిరా అనడంతో కొద్దిసేపు ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సీఐ నర్సింహరావు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కాలుష్య నివారణకు చర్యలు



చైర్మన్, వైస్ చైర్మన్‌లకు వినతిపత్రం అందజేస్తున్న మైహోమ్స్ కాలనీ వాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్య నివారణకు చర్యలు చేపడతామని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని మైహోమ్స్ కాలనీ, అంతఃపురం కాలనీల్లో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరిలు పర్యటించారు. ఈ సందర్భంగా మైహోమ్స్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు వీరిరువురికి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పరిశ్రమల వలన వచ్చే కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలుష్య కారకులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు వెనకడుగువేసేది లేదన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ కంబాలపల్లి భరత్‌కుమార్ తండ్రి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం శేరిగూడలోని వారి నివాసానికి వెళ్లి, భౌతికకాయన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.

ముమ్మరంగా కులగణన

సమగ్ర కుటుంబ సర్వే రెండోరోజు ఆదివారం ముమ్మరంగా కొనసాగింది. ఎన్యుమరేటర్లు.. ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నావళికి కుటుంబాల నుంచి సమాధానం రాబట్టేందుకు భగీరథ యత్నం చేశారు. అక్కడక్కడ ప్రజలు వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు వెనుకాడుతుండటంతో.. వివరాల సేకరణకు చెమటోడుస్తున్నారు.

- సమాచారం ఇచ్చేందుకు వెనుకాడుతున్న జనం
- సర్వే ప్రక్రియను వివరిస్తున్న ఎన్యుమరేటర్లు
- పర్యవేక్షించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ యజమానుల నుంచి సమాచారం సేకరించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి ముకునూర్, రాయపోల్ గ్రామాలను డీఆర్‌డీఏ పీడీ శ్రీలత సందర్శించి సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముకునూర్‌లో 511 కుటుంబాలున్నాయని, నాలుగు ఈబీలను ఏర్పాటు చేసి, నలుగురు టీచర్లతో ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజ్‌కుమార్ అధికారికి వివరించారు. ఇదిలా ఉండగా.. ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో మొదటి రోజు 290, రెండో రోజు 760 ఇళ్లను సర్వే చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఎస్‌ఓ కృష్ణారెడ్డి ఉన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్..

కులగణనలో సేకరించిన సమాచారాన్ని సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. ఈ ప్రక్రియను శేరిగూడ సమీపంలోని ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

మున్సిపాలిటీలో..

కులగణలో భాగంగా మొదటి రోజు 217, రెండో రోజు 440 ఇళ్ల సర్వే పూర్తి చేశారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందుకు అవసరమైన కంప్యూటర్, ఆపరేటర్లను ఎంపిక చేసే పనిలో మున్సిపల్ అధికారులు బిజీగా ఉన్నారు.

మంచాలలో..

మంచాల: మండల పరిధి నోముల గ్రామంలో ఎన్యుమరేటర్ల సర్వేను ఎంపీడీఓ బాల శంకర్ పరిశీలించారు. కులగణనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రతగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో సర్వే ప్రక్రియను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధి చంద్రాయన్‌పల్లితండా, విఠాయిపల్లిలో సర్వే ప్రక్రియను కమిషనర్ వసంత పరిశీలించారు. కులగణను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు ఆమె సూచించారు.



తలకొండపల్లి: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



ఆమనగల్లులో.. కమిషనర్ వసంత



కడ్తాల్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాత

సెలవు దినాల్లో మినహాయింపు



ఎన్యుమరేటర్ సర్వేను పరిశీలిస్తున్న ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్

మంచాల: కులగణన సర్వేకు సెలవుదినాల్లో ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ కోరారు. చాంద్‌ఖాన్ గూడ గ్రామంలో సర్వేను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. టీచర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాలలో పని చేసి, ఆ తరువాత సర్వే పనుల్లో నిమగ్నమవడంతో ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం, పండుగ సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వడంతో పాటు.. అత్యవసర సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అపోహలు వీడండి..



సర్వేలో మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి తదితరులు

యాచారం: ప్రజలు అపోహలు వీడి సర్వే అధికారులకు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి కోరారు. ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు జనం సమాధానం ఇవ్వాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన కులగణను మండల ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో కలిసి సర్వేలో పాల్గొన్నారు. ఎంపీడీఓ.. గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ఎన్యుమరేటర్లతో కలిసి సర్వే చేశారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధి పడకల్, తలకొండపల్లి, వెల్జాల్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నామని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఆదివారం తెలిపారు. పడకల్‌లో ఉదయం 11 గంటలకు, తలకొండపల్లిలో 11.30 గంటలకు, వెల్జాల్లో 12.15 గంటలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయా సెంటర్లను ప్రారంభించనున్నారని వెల్లడించారు. కార్యక్రమానికి సింగిల్‌విండో డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

సంజీవ మరణం తీరని లోటు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చేత్నాళ్ల సంజీవ(54) మరణం తీరని లోటని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి జాపాల గ్రామంలో అనారోగ్యంతో సంజీవ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన.. సంజీవ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సంజీవ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసేవాడని, ఎవరికి ఏ కష్టం వచ్చినా.. ముందుండేవాడని గుర్తుచేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు విష్ణు వర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

నిస్వార్థ సేవకుడు

నిస్వార్థ ప్రజాసేవకుడు సంజీవ, అలాంటి మంచి మిత్రున్ని కోల్పోయానని సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ సంజీవ రావు అన్నారు. అనంతరం సంజీవ పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట తెలంగాణ విశ్వవిద్యాలయాల నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఎన్. జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు



ఇబ్రహీంపట్నం: నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ



కడ్తాల్‌లో.. తహసీల్దార్ ముంతాజ్

- అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోండి
- ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ ముంతాజ్

ఇబ్రహీంపట్నం: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకావాలని ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ–2025లో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ సందర్శించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఓటరు నమోదు చేసుకోవడానికి ఫారం–6, అభ్యంతరాలకు ఫారం–7, సవరణల కోసం 8 ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ పుష్పలత పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

కడ్తాల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, జనవరి1, 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువత ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రం బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 158, 159 పోలింగ్ కేంద్రాల్లో నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్ఓలను సంప్రదించాలని తెలిపారు. ఆర్ఐ వాహెద్, బీఎల్ఓలు వనిత, శైలజ, లావణ్య ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధి కమ్మగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు తెలిపారు. కమ్మగూడ, ఈస్ట్ సూరజ్ నగర్, సుభాష్ నగర్, శాంతి నగర్, రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్, నవభారత్ కాలనీ, ఏపీఏటీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, వశిష్ట 1,2 కాలనీలు, టీచర్స్ కాలనీ, సెయింట్ ఫాల్స్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

తుర్కయంజాల్ ఫీడర్ పరిధిలో..

ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు లక్ష్మీ మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, లక్ష్మీగార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్ కాలనీ, తుర్కయంజాల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి అబ్దుల్లాపూర్ మెట్ కూడలి, బీసీ కాలనీ, మైత్రీగోకులం, న్యూలైఫ్ విల్లాస్, నిత్యాఎవెన్యూ, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ సర్కార్

- ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి
- లేదంటే రైతులతో కలిసి పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ సర్కార్ రైతులను వంచిస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. శేరిగూడ, మల్‌శెట్టిగూడ గ్రామాల పరిధి పొలాల్లో రైతులను ఆదివారం కలిశారు. వడ్ల కొనుగోలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అడుగడుగునా వారిని మోసం చేస్తుందని ఆరోపించారు. కోతలు మొదలై 20 రోజులు దాటినా కల్లాల వద్దే వరి కుప్పలు పెట్టుకుని కర్షకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనట్లు అధికార పార్టీ ప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నారే కానీ.. ధాన్యం ఎందుకు కొనడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

ముందుచూపులేని ప్రభుత్వం

కేసీఆర్ ప్రభుత్వం ఏ పని చేపట్టినా ప్రణాళికబద్ధంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంచిరెడ్డి వెల్లడించారు. రైతురుణ మాఫీ సరిగా చేయలేదని, కౌలు రైతుకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని రేవంత్ సర్కార్ మరిచిపోయిందన్నారు. క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లింపు అంశంపై ప్రభుత్వం మాటమార్చిందన్నారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపికృష్ణను మంచిరెడ్డి ఫోన్‌లో సంప్రదించి రైతుల కష్టాలను వివరించారు. వడ్లను ఎప్పుడు కొంటారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని గోపికృష్ణ హామీ ఇచ్చారు. కొనుగోలు చేపట్టకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, శంకర్, శ్రీకాంత్, మల్లేశ్‌యాదవ్, గణేశ్, వీరారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలం, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవొద్దు

పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వరి ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవొద్దని ఎంపీపటేల్‌గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి పోచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల మేలు కోరి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే.. మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందని, సకాలంలో బ్యాంకు ఖాతాలో డబ్బులు పడతాయన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీశైలం, యాదమ్మ, వ్యవసాయ శాఖ అధికారి విద్యాధరి, ఏఈఓ శ్రవణ్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ విజయలక్ష్మి, నాయకులు రాంరెడ్డి, కరుణారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

- ప్రజారంజక పాలనను జీర్ణించుకోలేని బీఆర్ఎస్
- కాంగ్రెస్ పార్టీ నేతలు

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆదివారం మండల పరిధి మక్తమాధారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఫాంహౌస్‌కే పరిమితమై, పగటి కలలు కంటున్న బీఆర్ఎస్ పెద్దలు, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి, అవినీతి, కుంభకోణాలతో ప్రజాగ్రహానికి గురై అధికారం కోల్పోయిన విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. పదేళ్ల వారి పాలనలో తెలంగాణలోని అన్ని వ్యవస్థలు విధ్వంసమయ్యాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని పేర్కొన్నారు. దారి తప్పిన ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం గాడిలో పెడుతుందని తెలిపారు. ప్రజారంజక పాలన చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్ష నేతలు.. ప్రతీది రాజకీయం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో ప్రజా సంక్షేమాభివృద్ధి పథకాలతో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే పాలన సాగిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు కృష్ణ, వెంకన్న తదితరులు ఉన్నారు.

భక్తుల కొంగుబంగారం..

- నృసింహుడి పురాతన ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం
- రూ.2.50 కోట్లతో రెండున్నరేళ్ల క్రితం పనులు ప్రారంభం
- దాతల సహకారాంతో పూర్తి కావచ్చిన పనులు
- ప్రతిష్ఠాపనకు సిద్ధమవుతున్న దేవతామూర్తుల విగ్రహాలు



లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం (ఇన్‌సెట్లో) స్వామివారి సన్నిధిలో పుష్కరిణి



యాచారం: మొండిగౌరెల్లి గ్రామం రాతిగుహల్లో కొలుదీరిన లక్ష్మీనృసింహుడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. స్వయంభుడను దర్శించుకోవడానికి ఉమ్మడి జిల్లాతో పాటు నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. భక్తుల విశ్వాసం చూరగొన్న స్వామివారికి భక్తజనం తాకిడి పెరగడంతో.. పురాతన ఆలయాన్ని పునర్నిర్మించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు గుర్రం చెన్నకేశవరెడ్డి సంకల్పించాడు. దాతల సహకారంతో రెండేళ్ల క్రితం రూ.2.50 కోట్లతో గుడి నిర్మాణం ప్రారంభించారు. ఆలయ నిర్మాణంతో పాటు.. విశ్వసేన దేవాలయం, మండపం, మెట్ల మార్గం, తాగునీటి, విద్యుత్ వసతిని కల్పిస్తున్నారు.

విరాళాల వెల్లువ

నృసింహుడి ఆలయ నిర్మాణానికి అనేక మంది దాతలు ముందుకు వచ్చారు. వేలు, లక్షలు విరాళంగా ఆలయ కమిటీకి అందజేస్తున్నారు. గుడిలో ప్రతిష్ఠించే దేవతామూర్తుల విగ్రహాలకు రూ.5 లక్షలు వెచ్చించి ఏపీలోని ఆల్లగడ్డలో ఓ శిల్పి వద్ద తయారు చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, వచ్చే ఏడాది మార్చి నెలలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

గుండం నీటికి ప్రత్యేకత..

స్వయంభు నృసింహుడు దేవాలయం ఎదుట ఈశాన్య దిశలో ఉన్న గుండం నీళ్లకు ప్రాధాన్యత ఉంది. ఎంత కరువు ఏర్పడినా నీళ్లు ఎండిపోవని గ్రామ పెద్దలు చెబుతున్నారు. పంట చేలకు తెగుళ్లు సోకినా, పురుగు పట్టినా ఈ నీటిని పంటపై చల్లితే.. చీడపీడ మాయం అవుతుందని పేర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ నీటితో స్నానం చేయిస్తే.. ఆరోగ్య వంతులు అవుతారని, అవే నీటిని ఇంటి నిర్మాణంలో కలిపితే ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని గ్రామస్తులు నమ్ముతున్నారు. మరే ఇతర కార్యక్రమాలు మొదలు పెట్టినా.. ఆ నీటిని చల్లుకుంటే అంతా శుభమే కలుగుతుందని స్పష్టంచేస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..



నృసింహుడి దయ, దాతల సహకారం, గ్రామస్తుల భాగస్వామ్యంతో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. పనులు పూర్తి కావచ్చాయి. విగ్రహాలు సిద్ధం అవుతున్నాయి. గుడిమెట్ల మార్గం 45 రోజుల్లో పూర్తవుతుంది.

– చెన్నకేశవరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, మొండిగౌరెల్లి